క్లుప్తంగా

రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ శనివారం ఘనంగా జరిగింది. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, సంతోష్, రాజ్యలక్ష్మి, సౌందర్య, కృష్ణవేణి, లావణ్య, సరిత పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ


నోట్ పుస్తకాలు అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ చింతపల్లి శోభారెడ్డి తదితరులు

మోతీనగర్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు చేయూత అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్నేహితం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చింతపల్లి శోభారెడ్డి అన్నారు. శనివారం మూసాపేట డివిజన్ బబ్బుగూడ ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సంపాదించిన దానిలో కొంతైనా సమాజం కోసం వెచ్చించాలన్నారు. కార్యక్రమంలో గూడూరు శ్రీధర్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

కూకట్‌పల్లి: నియోజకవర్గానికి చెందిన ఇద్దరికి రూ.1.09 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ మూసాపేటలోని పార్టీ కార్యాలయంలో శనివారం అందజేశారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మయ్య, తూము వేణు, మస్తాన్‌రెడ్డి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బందికి కిట్ల పంపిణీ


రక్షణ పరికరాల కిట్లను అందజేస్తున్న కార్పొరేటర్ రోజాదేవి రంగారావు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని బాగ్ అమీర్ వార్డు కార్యాలయంలో వర్షాకాలం నేపథ్యంలో శానిటేషన్ సిబ్బందికి వ్యక్తిగత రక్షణ పరికరాల కిట్లను శనివారం కార్పొరేటర్ మాధవరం రోజాదేవి స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో అందించిన కిట్‌లలో ఎక్కువ సామగ్రిని అందజేశామని, ఈసారి మాత్రం కిట్‌లలో చాలా వరకు సామగ్రి తగ్గించి ఇవ్వటం సరికాదన్నారు. కార్యక్రమంలో తీగల కృష్ణారావు, యంజాల యాదగిరి, మురళి, జగదీష్ గౌడ్, రవీందర్‌రావు, నరహరి, సతీష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన

మూసాపేట: మూసాపేటలోని చిత్తారమ్మ తల్లి జాతర సందర్భంగా శనివారం ఏర్పాట్లను మాజీ కార్పొరేటర్ బాబూరావు పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేయటం, ఆలయం చుట్టూ చిప్స్ వేయటం చేశామని, మంచినీటి సదుపాయం కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గోపాల్, ఎల్లేష్, నర్సింగరావు, నిఖిల్ కుమార్, సప్పిడి శ్రీనివాస్, భాస్కర్‌రావు, మల్లేష్, ఎజాస్, తదితరులు పాల్గొన్నారు.

డీసీకి శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్

మూసాపేట: మూసాపేట డివిజన్ కార్పొరేటర్ శిరీష బాబూరావు డీసీ ఇస్లావత్ నాయక్‌ను శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాలాజీనగర్ డివిజన్ అభివృద్ధికి సంబంధించిన ముఖ్యమైన అంశాలపై డీసీతో చర్చించారు. డ్రైనేజీ, రోడ్లు, వీధి లైట్ల ఏర్పాటు వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.


డీసీకి మొక్క అందజేస్తున్న కార్పొరేటర్ శిరీష బాబూరావు



అమ్మలను కన్న అమ్మ చిత్తారమ్మ. ఆదివారం అమ్మవారికి బోనాలు అత్యంత భక్తి శ్రద్ధలతో సమర్పించనున్నారు. బోనాలకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరానుండటంతో వారికి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆషాఢమాసంలో నాలుగో ఆదివారం బోనాలు సమర్పిస్తారు.

చిత్తారమ్మ బోనాలకు వేళాయే..

- నేడు బోనాలు సమర్పించనున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ ప్రతినిధులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి గ్రామంలో వెలిసిన చిత్తారమ్మ ఆలయానికి వందల సంవత్సరాల చరిత్ర ఉంది. ఆనాడు గ్రామంలో మహమ్మారిని అమ్మవారి ఆశీస్సులతో ఎదుర్కొనట్లు గ్రామ పెద్దలు చెబుతుంటారు. గ్రామంలో పంట పొలాలను రక్షించడానికి, పశు సంపదను అభివృద్ధి చేయడానికి, పశువుల కాపరికి ఎలాంటి ఆటంకం కలగకుండా గ్రామ ప్రజలను రక్షిస్తూ అమ్మవారు కొలువైందని ఇక్కడి ప్రజలు నమ్మకం.



నాడు చిన్నగుడి

కూకట్‌పల్లిలో ఉత్తర భాగాన ఏర్పడిన చిత్తారమ్మ దేవాలయం పాతకాలంలో చిన్న గుడిగా ఉండేది. గుడి చుట్టూ ఎడ్లబండ్లను తిప్పుతూ బోనాలను సమర్పించేవారు. అక్కడే వండుకొని అమ్మవారికి సమర్పించి కల్లు సాక పోసి మొక్కు చెల్లించేవారు. అనంతరం దేవాలయం ప్రాంగణంలో వెలసిన దుకాణాలతో అక్కడి ప్రజలు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఘనంగా నిర్వహించుకునేవారు. మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామీణ ప్రాంతం పట్టణ ప్రాంతంగా ఏర్పడటంతో పాటు కార్పొరేషన్‌గా గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనమైంది. దీంతో బోనాల ఉత్సవాలు కూడా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. అప్పటి ఎడ్ల బండ్లు నేడు లేకపోవడంతో ట్రాక్టర్లు, అనంతరం లారీలు, ప్రస్తుతం కార్లతో దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ వ్యాపారం వృద్ధి చెందాలని వాహన పూజలు చేస్తారు.

భారీగా భక్తులు

చిత్తారమ్మ ఆలయ బోనాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. ఉదయం 7 నుంచి 12 గంటల వరకు దాదాపు కిలోమీటర్ మేర అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూలో నిలబడతారు. కూకట్‌పల్లి పరిసర ప్రాంతంలోనే కాకుండా నగర శివారు ప్రాంతాల్లోని భక్తులు కూకట్‌పల్లి చిత్తారమ్మను దర్శించుకుంటారు. కూకట్‌పల్లి చిత్తారమ్మను ఆరాధించిన వారు సామాన్యులు సైతం అంచలంచెలుగా ఎదుగుతారని ఇక్కడివారి నమ్మకం.

ఎమ్మెల్యే కృషితో అభివృద్ధి

ఇటీవలనే చిత్తారమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేశారు. దీనికి ఎమ్మెల్యే కృష్ణారావు కృషి మరువలేనిదని పలువురు తెలిపారు. దేవాలయం ప్రాంగణంలో సామాన్య ప్రజల అవసరాలకు ఫంక్షన్ హాల్ నిర్మాణం కూడా చేపట్టారు. అదేవిధంగా షాపింగ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేశారు. గ్రామ దేవతగా ఉన్న చిత్తారమ్మ తల్లిని గ్రామ ప్రజలు ఏ స్థాయిలో ఉన్న వారైనా అమ్మవారిని దర్శించుకోవడానికి నాలుగో ఆదివారం తప్పకుండా వచ్చి అమ్మవారి ఆశీర్వాదాలు తీసుకుంటారు.

అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు



చిత్తారమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశాం. ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి మరువలేనిది. అభివృద్ధి కోసం నిధులు సేకరించి దీర్ఘకాలిక యోచనతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రణాళికలతో ముందుకెళ్లాం. ప్రజా ప్రతినిధులు, భక్తులు సహకారం ఎల్లప్పుడు ఉంటుంది.
– నాయినేని శ్రీనివాసరావు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్

వైభవంగా బోనాలు



ఆషాఢమాసం నాలుగో ఆదివారం అమ్మవారికి అత్యంత భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పిస్తాం. భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారు. వారికి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశాం. గ్రామ పెద్దలు దేవాలయం అభివృద్ధి కోసం చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకొని అందరం కలిసికట్టుగా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నాం.
– మాధవరం శ్రీనివాసరావు, దేవాలయ కమిటీ సభ్యుడు

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. క్యాంపు కార్యాలయంలో శనివారం జీహెచ్‌ఎంసీ కార్మికులకు వ్యక్తిగత పరిశుభ్రత పరిరక్షణ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యానికి రక్షణ కవచంలా పారిశుద్ధ్య కార్మికులు ఉంటారనటంలో అతిశయోక్తి లేదన్నారు. వారు కూడా ఆయురారోగ్యాలతో ఉంటేనే మనం బాగుంటామని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్, ఎస్ఎస్ మనోరెడ్డి, ఎస్ఆర్‌పీ వినయకాంత్, ఎస్ఎఫ్ వి. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులు తల్లిదండ్రులతో సమానం


కిట్లను అందజేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

- పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ
- కార్మికులకు పీపీఈ కిట్ల అందజేత

ఆల్విన్‌కాలనీ: నిరంతరం ప్రజల ఆరోగ్యం ఉండటానికి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికులు తల్లిదండ్రులతో సమానమని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని కూకట్‌పల్లి పార్టు, వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీ డివిజన్‌ల పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కార్పొరేటర్లు నార్నే శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పీపీఈ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో వారి సేవలు మన పరిసర ప్రాంతాలను, కాలనీలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతూ కాలనీల్లో ప్రశాంత వాతావరణం కోసం పని చేశారన్నారు. ఎప్పటికప్పుడు రోడ్లను శుభ్రం చేస్తూ పరిసరాల పరిశుభ్రతే ధ్యేయంగా పనిచేస్తున్నారని వారి సేవలను కొనియాడారు. వారికి జీతాలు పెంచడమే కాకుండా వారి ఆరోగ్యం కాపాడే బాధ్యత కూడా మనదే అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహృదయంతో ఆరోగ్య పరిరక్షణకు పీపీఈ కిట్లను కార్మికులకు అందజేస్తున్నారని తెలిపారు. కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య సూపర్ వైజర్ మనోహర్‌రెడ్డి, నాయకులు సంజీవరెడ్డి, నాయినేని చంద్రకాంత్ రావు, రామకృష్ణ గౌడ్, మోజెస్, చంద్రమోహన్ సాగర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: నియోజకవర్గానికి చెందిన 25 మందికి రూ.12.15 లక్షల విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఆ చెక్కులను శనివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకొని బిల్లులు చెల్లించలేని పేద వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చిన్నారి అదృశ్యం


రక్షిత

మోతీనగర్: ఓ చిన్నారి అదృశ్యమైన సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సామల వెంకటరెడ్డి వివరాల ప్రకారం.. అల్లాపూర్‌లో నివసించే దేవేందర్ కుమార్తె బేబి రక్షిత(7) 19న మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో స్నేహితులతో ఆడుకుంటానని చెప్పి బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన తండ్రి అల్లాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎవరికైనా చిన్నారి కనిపిస్తే అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ 87126 63335, అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ 87126 63699 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి

- కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు


అధికారులతో కలిసి కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: సమతానగర్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సమతా నగర్ కాలనీలో ట్రాఫిక్ సమస్యపై హార్టికల్చర్, ఎలక్ట్రికల్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. సమతా నగర్ కాలనీ నుంచి ప్రగతినగర్‌కు వెళ్లే వాహనాలతో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది లేకుండా చూడాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేశారు. అక్కడ రోడ్డు అంచులలో ఉన్న చెట్లను, జియో ఫైబర్ వారి స్తంభాలను వెంటనే తొలగించాలని కార్పొరేటర్ అధికారులకు తెలిపారు. అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని, మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ హార్టికల్చర్ డిపార్టుమెంట్ దాసు, ఎలక్ట్రికల్ లైన్‌మెన్ శ్రీనివాస్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



బాలానగర్: జేఎన్‌టీయూలో 2000 విద్యా సంవత్సరం ఈఈఈ, ఈసీఈ విభాగాలకు చెందిన విద్యార్థులు శనివారం వర్సిటీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగం అధిపతి టి. మాధవి కుమారి, ఈఈఈ విభాగం అధిపతి కె. ఫణిశ్రీ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి

బాలానగర్: రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగింది. సీఐ నరసింహరాజు వివరాల ప్రకారం.. సూరారంలోని పాండు బస్తీకి చెందిన సురేష్ (35) వాటర్ ప్లాంట్‌లో టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి సుమారు 1 గంట సమయంలో హెచ్ఏఎల్ కంపెనీ గేటు దగ్గర లారీ యూటర్న్ తీసుకుంటూ ఉండగా సురేష్ లారీని ఢీకొట్టాడు. దీంతో తలకు బలమైన గాయాలయ్యాయి. హాస్పిటల్‌కు తరలించే క్రమంలో మృతి చెందాడు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి

బాలానగర్: తాగునీరు కలుషితం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరాగాంధీ పురంలో తాగునీరు కలుషితం అవుతుందని స్థానికుల ఫిర్యాదుతో జలమండలి మేనేజర్ అనిల్‌కుమార్‌తో కలిసి శనివారం పర్యటించారు. ఇందిరాగాంధీ పురంలో ఒక వీధిలో తాగునీరు కలుషితం కావడానికి గల కారణాలను పరిశీలిచాలని, వారంలో సమస్యను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో సయ్యద్ గౌస్, అన్వర్, సలీం, షౌకత్ కేసర్, హస్మత్, అరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఆహ్వానం



ఆల్విన్‌కాలనీ: పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీని, మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌ను శనివారం ఆహ్వానించారు. కార్యక్రమంలో రామకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మలిదశ ఉద్యమకారులను ఆదుకోవాలి

మోతీనగర్: తెలంగాణ మలి దశ ఉద్యమకారులను ప్రజా ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు మలి దశ ఉద్యమకారులు కోరారు. శనివారం మోతీనగర్ రాయల్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో మలి దశ ఉద్యమకారుల కార్యాచరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమంలో సుమారు దశాబ్దం పాటు నిర్విరామంగా పోరాడితేనే తెలంగాణ వచ్చిందన్నారు. వచ్చిన తెలంగాణను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదేవిధంగా మలిదశ ఉద్యమకారులకు స్వాతంత్ర్య సమరయోధుల వలే పింఛన్, ఇటిస్థలం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గూడూరు చిన్నారెడ్డి, కొండపల్లి శ్రీలత, ఎస్. ఇంద్రజిత్‌సింగ్, స్వామి, మర్రి విష్ణువర్ధన్ రెడ్డి, టింగిల్కర్ నాగేశ్వరరావు, నాగరాజు, సత్యనారాయణ గౌడ్, నర్సింగరావు, కమలాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్‌లో ఉచిత వైద్య శిబిరం

బాలానగర్: ఆరోగ్యంపై అవగాహన కలిగినపుడే వ్యాధుల భారిన పడకుండా ఉంటామని జేఎన్‌టీయూహెచ్ రెక్టార్ కె. విజయకుమార్ రెడ్డి అన్నారు. శనివారం జేఎన్‌టీయూలోని ఆడిటోరియంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 800 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారుగా పది హాస్పిటల్స్‌కు చెందిన వైద్యులు శిబిరంలో వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఘనంగా బోనాలు


పంచశీల పాఠశాలలో..


విజ్ఞాన జ్యోతి స్కూల్‌లో..

కూకట్‌పల్లి/ఆల్విన్‌కాలనీ/మూసాపేట/మోతీనగర్: నియోజకవర్గంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో బోనాలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శివసత్తులు, పోతరాజుల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు బోనాలను ఎత్తుకొని పాఠశాల నుంచి ఊరేగింపులో పాల్గొని స్థానిక అమ్మవారి ఆలయాల్లో బోనాలను సమర్పించారు.


శ్రీ సాయి చైతన్య టెక్నో స్కూల్‌లో..


న్యూఎరా పాఠశాలలో బోనాల ఉత్సవాల్లో ..

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దర్ నగర్, రాజీవ్ గాంధీ నగర్ నాలా పరివాహక ప్రాంతాల్లో శనివారం జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఏఈ రంజిత్‌తో కలిసి పర్యటించారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షాల నేపథ్యంలో నాలా పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమయానికి అధికారులు స్పందించి సహాయక చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారులు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సయ్యద్ రియాజ్, అబ్దుల్ సలీం, అస్లాం, మల్లేష్, నరసింహారెడ్డి, ఫర్వీన్ సుల్తాన తదితరులు పాల్గొన్నారు.


నాలా పరివాహక ప్రాంతాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

ఆలయ భూములను పరిరక్షించాలి

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీలోని వరసిద్ధి వినాయక ఆలయానికి చెందిన భూమిని పరిరక్షించాలని కాలనీవాసులు, భక్తులు డిమాండ్ చేశారు. హౌసింగ్ బోర్డు అధికారుల తీరును నిరసిస్తూ శనివారం ఆలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆలయ భూమిని అమ్మకానికి పెట్టాలనే ఉద్దేశంతో దాని చుట్టూ ప్రహరీ నిర్మించి కోట్ల రూపాయలు దండుకోవాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం కేపీహెచ్‌బీ కాలనీలో కనబడిన భూములన్నీ అమ్ముతున్నారని, ప్రతి వినాయక చవితి, దేవీ నవరాత్రి ఉత్సవాల్లో, అయ్యప్ప మాలధారణ సమయంలో సుమారు 5 వేల మంది భక్తులకు అన్నదానం చేసే స్థలాన్ని హౌసింగ్ బోర్డు అధికారులు ఎలా అమ్మడానికి యత్నిస్తున్నారని ప్రశ్నించారు.


ఆలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న భక్తులు